VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 31-05-2024 సంపుటి : 06 సంచిక : 259 పేజీలు : 8 వెల : రూ 3-00



# రామ జన్మస్థలం కోసం తొలి యుద్ధం చేసింది వారే..

## హోషియార్‌పూర్ సభలో మోదీ కీలక ప్రకటన

పంజాబ్ : పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో లోక్‌సభ ఎన్నికలు-2024 కోసం ప్రధాని నరేంద్ర మోదీ తన చివరి ర్యాలీని నిర్వహించారు. సిక్కులపై కీలక ప్రకటన చేసిన మోదీ, అయోధ్యలో రామ జన్మస్థలం కోసం సిక్కులు మొదటి యుద్ధం చేశారన్నారు.మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని దేశ ప్రజలు నిర్ణయించుకున్నారని ప్రధాని మోదీ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించి మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టబోతోందని స్పష్టం చేశారు.లోక్‌సభ ఎన్నికలు-2024కి సంబంధించి ఏడోవ, చివరి దశ ఓటింగ్ జూన్ 1న జరుగుతుంది. ఈరోజుతో అంటే గురువారం ఎన్నికల ప్రచారం నిలిచిపోనుంది. పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో చివరి దశలో ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలోనే ప్రధాని నరేంద్ర మోదీ తన చివరి ర్యాలీని ఇక్కడే నిర్వహించారు. ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పంజాబ్ మన భారతదేశానికి గుర్తింపు అని, ఇది మన గురువుల పుణ్యభూమి అని అన్నారు. అంతేకాదు అయోధ్యలో రామ జన్మభూమి కోసం తొలి యుద్ధం చేసింది సిక్కులే అని అన్నారు.నేడు దేశంలో ఆకాంక్షలు కొత్తవి, అంచనాలు కొత్తవి, విశ్వాసం కొత్తవి అని ప్రధాని అన్నారు. దశాబ్దాల తరవాత అలాంటి సమయం రాగానే సంపూర్ణ మెజారిటీతో కేంద్ర ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టబోతోందన్నారు. ప్రతి భారతీయుడి 'అభివృద్ధి చెందిన భారతదేశం' అనే కల త్వరలోనే నేరబోతుందన్నారు అందుకే ప్రతి దేశస్థుడు మనల్ని ఆశీర్వదిస్తున్నారన్నారని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వాన్ని మరోసారి ఏర్పాటు చేయాలని దేశప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు. మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టబోతోంది. 21వ శతాబ్ది భారతదేశానికి బలమైన ప్రభుత్వం అవసరమని ప్రధాని అన్నారు. శత్రువును ఓడించగల బలమైన ప్రభుత్వం ఏర్పాటు కావల్సిన అవసరముందన్నారు.ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికే రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని ప్రధాని మోదీ తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలో కూడా నిర్ణయించామన్నారు. 125 రోజుల రోడ్‌మ్యాప్ సిద్ధంగా ఉందన్నారు. వారణాసి ఎంపీగా కాశీని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానన్నారు. మధ్యప్రదేశ్‌లో రవిదాస్ ఆలయానికి శంకుస్థాపన చేయడం నాకు దక్కిందని ప్రధాని అన్నారు. అయోధ్యలో రాముడి ఆలయాన్ని నిర్మించాం. మహర్షి వాల్మీకి విమానాశ్రయాన్ని నిర్మించామన్న మోదీ, ఆదంపూర్ విమానాశ్రయానికి గురు రవిదాస్ పేరు పెట్టాలని కోరుకుంటున్నానన్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇది అమలులోకి వస్తుందన్నారు.అలాగే కాంగ్రెస్‌తో పాటు ఆమ్ ఆద్మీ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధాని మోదీ. రెండు పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయని అన్నారు. ఇండి కూటమి స్వార్థ రాజకీయాలు దేశానికి చాలా నష్టాన్ని కలిగించాయని ప్రధాని అన్నారు. ఓటు బ్యాంకు విషయంలో సీఏఏను భారత కూటమి వ్యతిరేకిస్తోంది. ఓటు బ్యాంకు కోసం రామమందిరాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ప్రతిపక్షాలు మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేశారు. 1984లో జరిగిన అల్లర్లలో సిక్కుల మెడకు టైర్లు కట్టి తగులబెట్టారని మోదీ గుర్తు చేశారు.దళితులు, వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను ఎవరూ తీసుకోరని ప్రధాని మోదీ మరోసారి స్పష్టం చేశారు. రిజర్వేషన్లకు సంబంధించి భారత కూటమి ఉద్దేశాలు ప్రమాదకరమైనవన్న మోదీ. దళితులు, వెనుకబడిన తరగతుల నుంచి రిజర్వేషన్లు లాక్కొని ముస్లింలకే ఇవ్వాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ అవినీతికి తల్లి. అవినీతిలో కాంగ్రెస్ డబుల్ పీహెచ్‌డీ చేసినట్లు తెలుస్తోంది. అవినీతిలో కూరుకుపోవడానికి కాంగ్రెస్‌కు 60 ఏళ్లు పట్టిందని ప్రధానిఅన్నారు.

# కేరళతో పాటు ఈశాన్యంలో నైరుతి ప్రవేశం

**కేరళలో మొదలైన భారీ వర్షాలు...14 జిల్లాల్లో ఎల్లో అలర్ట్**
**వారంలోగా తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించే ఛాన్స్**
**చల్లటి కబురు అందించిన వాతావరణ శాఖ**



న్యూఢిల్లీ/తిరువనంతపురం,మే30: నైరుతి వచ్చేసింది. కేరళ తీరాన్నా గురువారం తాకింది. ఎండలతో అల్లాడుతున్న వేళ దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లటి వార్త అందించింది. నైరుతి రుతుపవనాలు గురువారం ఉదయం కేరళను తాకినట్లు ఐఎండీ అధికారికంగా ప్రకటించింది. కేర సహా ఈశాన్య రాష్ట్రాలను నైరుతి పవనాలు తాకినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో కేరళవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. 14 జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వారంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించనున్నట్లు చెప్పారు. లక్షద్వీప్, కేరళలోని కొన్ని ప్రాంతాలకు రుతు పవనాలు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే అంచనా వేసింది. నాలుగైదు రోజుల్లో రుతు పవనాలు రాయలసీమలోకి ప్రవేశించే ఛాన్స్ ఉందని అధికారులు వెల్లడించారు. వారం ముందుగానే రుతుపవనాల పురోగమనంతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గతేడాది కంటే ఈసారి ముందుగానే నైరుతి పవనాలు కేరళను తాకాయి. దేశ ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. మన దేశంలో 52 శాతం నికర సాగుభూమికి ఇప్పటికీ వర్షపాతమే ఆధారమే. ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40 శాతం వ్యవసాయ ఉత్పత్తులు దిగుబడి అవుతాయి. అటు, ఈ ఏడాది లానినా అనుకూల పరిస్థితులు, భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రం చల్లబడడం, ఆగస్ట్ - సెప్టెంబం నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉన్న క్రమంలో ఈసారి సీజన్ లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అధికారులు గత నెలలోనే అంచనా వేశారు. వాయువ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. 1951 నుంచి 2023 వరకూ ఎల్‌నినో తర్వాత లానినా వచ్చిన సందర్భాల్లో భారత్‌లో తొమ్మిదిసార్లు మంచి వర్షాలు కురిశాయని.. ఈ ఏడాది కూడా రుతుపవనాలు కదలిక అనుకూలంగా ఉందని వివరించారు. సాధారణంగా ఈశాన్య భారతంలో జూన్ 5కు అటు, ఇటుగా రుతు పవనాలు ప్రవేశిస్తాయి. కానీ ఈసారి మే 30నే ప్రవేశించాయి. రేమాల్ తుఫాను ప్రభావంతో రుతు పవనాలు వేగంగా కేరళను తాకినట్లు వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు.

# ఏపిలో కొత్త ప్రభుత్వానికి సవాలే..!


## అది వైసీపీ ఐతే ఒకలా.? టీడీపీ కూటమి ఐతే ఇంకోలా.?



విజయవాడ,జూన్ 9 నుంచి కొత్త ప్రభుత్వం పాలన ప్రారంభం కానుంది. అయితే ఇచ్చిన హామీలు, అభివృద్ధి, ఉద్యోగాల కల్పన వంటి అమలు ఆషామా షీ విషయం కాదు. కనీసం కొత్త ప్రభుత్వం కుదుటుపడాలంటే, పాలన గాడిలో పడాలంటే దాదాపు 2 సంవత్సరాల కాలం పట్టడం ఖాయం.జగన్ అధికారంలోకి వస్తే.. ఇప్పుడున్న దానికి కొనసాగింపు ఉంటుంది. అదే కూటమి అధికారంలోకి వస్తే మాత్రం చంద్రబాబుకు కత్తి మీద సామే. రాష్ట్ర సర్కార్ కు 12 లక్షల కోట్ల అప్పు ఉంది. ఈ అప్పును భరించాల్సిన అవసరం కొత్త ప్రభుత్వం పై ఉంది. కూటమి అధికారంలోకి వస్తే పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తామ ని హామీ ఇచ్చారు. పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుస్తామని కూడా చెప్పుకొచ్చారు.మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి ఇంట్లో ఆర్థిక భరోసా, పిల్లల చదువు కు ప్రోత్సాహం, సాగుకు పెట్టుబడి నిధి వంటి భారీ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని కూటమి మేనిఫెస్టోలో పెట్టింది. ఇవన్నీ అమలు చేయడం కష్టతరం. అసలు సంక్షేమానికి దూరంగా ఉండే చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకు తప్పనిసరి అయి పెద్ద ఎత్తున పథకాలు ప్రకటించారు. వీటన్నింటినీ అమలు చేస్తారా.? చేయలేరా.? లేకుంటే ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేస్తారా.? అన్నది తెలియాల్సి ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల మంది సామాజిక పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. నాలుగు వేలకు పింఛన్ మొత్తాన్ని పెంచుతానని ప్రకటించారు.దివ్యాంగులకు, కిడ్నీ బాధితులకు పింఛన్ మొత్తాన్ని పెంచుతామని కూడా చెప్పుకొచ్చారు. వాటిని అమలు చేయాలంటే కష్టతరంతో కూడుకున్న పని. మరోవైపు అభివృద్ధి చేపట్టాల్సి ఉంది.అమరావతి రాజధానిని అభివృద్ధి చేయాలి. ఒకవైపు సంపద పెంచుతూనే సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇవ్వాలి. ఉన్నది 5 సంవత్సరాల గడువు మాత్రమే. కనీసం రాష్ట్ర ఆదాయం పెంచాలంటే రెండేళ్ల సమయం పడుతుంది. ఈ రెండేళ్లలో అప్పులు ఎలా తగ్గించుకుంటారు. కొత్త అప్పులు ఎలా పుట్టించుకుంటారు. రాష్ట్ర ఆదాయాన్ని ఎలా పెంచుతారు.వన్నీ సవాళ్ల కిందే పరిగణించాల్సి ఉంటుంది.జగన్ అధికారంలోకి వస్తే కొత్తగా పథకాలు అమలు చేయాల్సిన పనిలేదు.ఉన్న వాటిని కొనసాగిస్తే చాలు. కానీ టిడిపి కూటమి అధికారంలోకి వస్తే మాత్రం కొత్తగా మార్పు చేసి చూపించాలి. లేకుంటే ప్రజలు విశ్వసించే ఛాన్స్ లేదు.ఏమవుతుందో.. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు కార్యాచరణ ఎలా ఉంటుందో... జూన్ 4వ తేది వరకు వేచి చూడక తప్పదు.

# లెక్కింపు కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేయండి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 30-జూన్ 4న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు.గురువారం పాణ్యం మండలం నెరవాడ గ్రామ సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు అనుసంధానంగా కౌంటింగ్ కేంద్రాలలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చేనెల 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డిని ఆదేశించారు. తొలుత కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించి సిసి కెమెరాలతో కనెక్ట్ చేయబడిన కౌంటింగ్ కేంద్రాల వెబ్ క్యాస్ట్ ను పరిశీలిస్తూ నిరంతరం నిఘా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని భద్రతా సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వారి ఏజెంట్లు మినహా ఇతరులు ఎవరు కౌంటింగ్ సెంటర్ల వద్దకు అనుమతించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

# లెక్కింపులో అలజడి సృష్టిస్తే తక్షణమే అరెస్ట్

## హెచ్చరించిన సిఇసి ముఖేశ్ కుమార్ మీనా

మచిలీపట్నం,మే30 ఓట్ల లెక్కింపు సమయంలో ఎవరైనా కౌంటింగ్ కేంద్రంలో అలజడి సృష్టిస్తే తక్షణమే వారిని అరెస్టు చేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా హెచ్చరించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాలాజీ, జిల్లా పోలీసు అధికారి అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి ఆయన పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, కౌంటింగ్ కేంద్రం భద్రతను పరిశీలించామని మీనా తెలిపారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సీఆర్‌పీఎఫ్ దళాలు భద్రతను పర్యవేక్షిస్తుంటాయని చెప్పారు. ఎన్నికల ఫలితాల తర్వాత జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఉంటుందన్నారు. ఫలితాల తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు.



# సంపాదకీయం

శుక్రవారం 31-05-2024

## శాస్త్రీయత లోపం..పెద్ద శాపం

సార్వత్రిక సమరం పతాక స్థాయికి వచ్చేసింది. సినిమా భాషలో చెప్పాలంటే క్లైమాక్స్ కు చేరుకుంది. అయితే జూన్ 1వ తారీఖు ఓటు వేసే వారు లక్కీఫెలోస్ అచి చెప్పవచ్చు. ఎందుకంటే అదే రోజు అర్థరాత్రి వరకూ ఎగ్జిట్ పోల్ సర్వే సంస్థలు ఏ పార్టీ ఎక్కడ గెలుస్తుంది మెజారిటీతో అధికారం చేపట్టబోయే పార్టీ ఏమిటో చెప్పేస్తారు. ఎగ్జిట్ పోల్ సర్వే ఎగ్జాట్ గా అంచనా వేస్తుందా అంటే దానికి ఎక్కడా శాస్త్రీయత ఉండదు. ఒక్కో సర్వే సంస్థ ఒక్కో రీతిన సర్వే అంశాలు చెబుతూ ప్రజలను పక్కతోవ పట్టిస్తుంటాయి. ఒకప్పుడు కనీసం 70 శాతమో లేక 80 శాతమో నమ్మశక్యంగా ఉండేవి. మరి ఇప్పుడు రాజకీయ పార్టీలే తమకు అనుకూలంటా ఉండే సంస్థలతో సర్వేలు చేపట్టి చెప్పిస్తున్నారు. అసలు ఫలితాలు వచ్చేసరికి ఖంగు తింటున్నారు. తెలుగు రాష్ట్రాలలో 13న జరిగిన ఎన్నికల తర్వాత 23 రోజులు ఉత్కంఠగా ఎదురుచూడాల్సిన పరిస్థితి. అంటే దాదాపు నెల్లాళ్లు టెన్షన్ అనుభవిస్తూ ఎదురుచూస్తున్నారు. సాధారణ పౌరుల నుంచి సెలబ్రిటీల దాకా అంతా ఉత్కంఠగా ఎదురుచూసేవి ఎగ్జిట్ పోల్ సర్వేలే. మరి అవి ప్రజల విశ్వాసాన్ని ఈ సారైనా చూరగొంటాయా లేదా అన్నది చూడాలి.వాస్తవానికి ప్రీపోల్ సర్వేలకు, ఎగ్జిట్ పోల్ సర్వేలకు పెద్దగా తేడా కనిపించదు. ఎందుకంటే 2003 సంవత్సరం ఆఖరులో జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్ గడ్, రాజస్తాన్ ఎన్నికలలో బీజేపీకి అనుకూల ఫలితాలు రావడంతో ఇండియా షైనింగ్ నినాదంతో 2004 కేంద్రంల బీజేపీ ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. అయితే బీజేపీకి అనుకూలంగా అప్పటి ఫలితాలు రావడంతో ఇండియా షైనింగ్ నినాదంతో 2004 కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. అయితే అప్పట్లో బీజేపీ మిళితమైన ఎన్టీఏ కూటమికి 240 నుంచి 250 స్థానాలు వస్తాయని మెజారిటీ పోల్స్ ప్రకటించాయి. అయితే ఫలితాలు మాత్రం తారుమారయ్యాయి. ఎన్టీయే కూటమి కేవలం 187 స్థానాలకే పరిమితమయింది. ప్రీ పోల్ సర్వేలకు, ఎగ్జిట్ పోల్ అంచనాలకు పెద్ద వ్యత్యాసం కనిపించదు. 2003 చివర్లో జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ ఎన్నికల్లో బీజేపీకి అనుకూల ఫలితాలు రావడంతో ఇండియా షైనింగ్ నినాదంతో 2004 కేంద్రంలో బీజేపీ ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి 240?250 నుంచి స్థానాలు సాధిస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ ప్రకటించగా ఫలితాలు రివర్సయ్యాయి. ఎన్‌డీఏ 187కే పరిమితమైంది. ఎగ్జిట్ పోల్స్ ఎగ్జాట్ గా అంచనాలు వేయలేకపోవడంతో దాదాపు 70 స్థానాలలో ఫలితాలు వ్యతిరేకంగా వచ్చాయి.2014 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో కూడా బీజేపీ సొంతంగా స్పష్టమైన మెజారిటీ సాధించబోతోందని ఎగ్జిట్ పోల్స్ అన్నీ దాదాపు అంచనాలు వేశాయి. కానీ అవి ఊహించిన రీతిలో మెజారిటీ స్థానాలు బీజేపీ దక్కించుకోలేకపోయింది. 2016 చివర్లో మోదీ సర్కార్ పెద్ద నోట్లను రద్దు చేశాక సామాన్య జనం ఎంతలా ఇబ్బందులు పడ్డారో అందరికీ తెలిసింది. అయితే జనం కసిగా ఈ సారి జరగబోయే ఎన్నికలలో ఎన్టీఏ కూటమి సరైన గుణపాఠం చెబుతారని అంతా అంచనాలు వేశారు. ఆ వెంటనే జరిగిన 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తల్లక్రిందులయ్యాయి. హంగ్ వస్తుందని చాలా సంస్థలు తమ అంచనాలను ప్రకటించాయి. అయితే ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పని నిరూపిస్తూ బీజేపీ ఏకంగా 300 స్థానాలు తన సొంతం చేసుకుంది. ఎన్నికల్లో ఎవరికి ఓటేసే అవకాశం ఉందంటూ ఓటర్ల అభిప్రాయాలను తెలుసుకుని రూపొందించేవి ఒపీనియన్ పోల్స్. ఓటేసి పోలింగ్ బూత్‌ల నుంచి తిరిగి వెళ్లే ఓటర్లను ప్రశ్నించి వేసే అంచనాలే ఎగ్జిట్ పోల్స్. ఒపీనియన్ పోల్స్ ఫలితాలను ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందు వరకు ప్రకటించవచ్చు. తుది దశ పోలింగ్ ముగిశాక ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసుకోవచ్చు.చాలావరకూ ఒపీనియన్ పోల్స్ అంచనాలు తల్లక్రిందులు కావడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. అంచనాలల తప్పులు ఎంత తక్కువగా ఉంటే ఫలితాలు అంత కచ్చితంగా దగ్గరగా ఉంటాయి. 1999 లోక్ సభ ఎన్నికలలో ఒపీనియన్ పోల్స్ అంచనాలు, వాస్తవ ఫలితాల మధ్య 20 సీట్లు తేడా వచ్చాయి. 2009 ఎన్నికలకు వచ్చేసరికి ఈ గ్యాప్ 25 నుంచి 60 స్థానాలకు పెరిగింది. 2014 సంవత్సరానికి వచ్చేసరికి 50 నుంచి 100 సీట్ల వరకూ తేడాలొచ్చాయి. అలా ఒక్కో పార్టీ/కూటమికి వచ్చే స్థానాలను లెక్కగడుతుంటాయి. ఇది కాలం చెల్లిన పాత విధానమని నిపుణులు అంటున్నారు. పోలింగ్ ఏజెన్సీలు సర్వేకు కావాల్సిన బలమైన వసతులు లేకపోవడం కూడా అంచనాల్లో తప్పులు పెరగడానికి కారణం.ప్రతి నియోజకవర్గం నుంచి శాంపిల్ సైజు వీలైనంత ఎక్కువగా ఉండాలి. ఇందుకు భారీగా సిబ్బంది, నిధులు, సమయం కావాలి. కానీ మన దగ్గర పోల్ ఏజెన్సీలకు ఈ వనరుల్లేవు. పార్టీల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే, ఫలితాల అంచనాలు అంత కష్టమవుతాయని సీఎస్‌డీఎస్ సైతం చెబుతోంది. 2014 ఎన్నికలలో 464 పార్టీలు పోటీ చేశాయి. 1998తో పోలిస్తే ఇది రెట్టింపు. పోలింగ్ ఏజెన్సీలు పోటాపోటీగా పెరుగుతున్నాయి. దాంతో చాలా శాస్త్రీయంగా పోల్ సర్వేలు నిర్వహించకుండానే ఫలితాలు వెల్లడిస్తున్నాయి. సర్వే అంచనాలు ఎందుకు తప్పాయని చాలా పోలింగ్ ఏజెన్సీలు విశ్లేషణను . పైగా సర్వే ఫలితాలను ఎలా రూపొందించారో ఆధారాలను కూడా వెల్లడించడం లేదు. ప్రీ పోల్ అంచనాలకు సంబంధించి జవాబుదారీ లేకపోవడం కూడా సమస్యకు కారణమే.

## నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

పొగతాగడం ఆరోగ్యానికి హానికరం. ప్రతీ సినిమా మొదలయ్యే ముందు వచ్చే ఈ మాటలు విని ఎంత మంది పొగ మానేస్తారో అర్థం కాదు. పొగ తాగడం వల్ల హానికరం అని తెలిసి కూడా మానలేకపోతున్నవారు చాలామందే ఉన్నారు.ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని మే 31న ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988, ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవం గా పిలుపునిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగదారులను ఏప్రిల్ 7వ తేదీన 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరింది. దానిని అనుసరించి 1988లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. పొగాకు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయడంకోసం అవగహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.ఈ అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారతదేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గింది.




## కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం : కేసీ వేణుగోపాల్

లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి ఈసారి తాము కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని, ఈ విషయంలో తాము పూర్తి విశ్వాసంతో ఉన్నామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు.జూన్ 4న తమకు అనుకూలంగా ఎన్నికల ఫలితాలు రానున్నాయని చెప్పారు. కేంద్రంలో విపక్ష ఇండియా కూటమి సర్కార్ కొలువుతీరుతుందనే విషయంలో తాము గట్టి నమ్మకంతో ఉన్నామని అన్నారు. దేశంలో వాతావరణం విపక్ష కూటమికి అనుకూలంగా ఉందని అంచనా వేశారు.ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ కూడా ఇదే విషయం వెల్లడిస్తోందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి మెజారిటీ సాధిస్తుందని, బీజేపీ 400 స్థానాలు వస్తాయని చెబుతున్నా తాము మాత్రం పూర్తి విశ్వాసంతో ఉన్నామని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు.




## నీతికి నిలువెత్తు నిదర్శనం దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### -మంథనిలో ఘనంగా శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

మంథని,నీతికి నిలువెత్తు నిదర్శనం ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. మంత్రి శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా గురువారం మంథనిలోని కూరగాయల మార్కెట్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్ ఆధ్వర్యంలో మంథని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. బస్టాండ్ ఆవరణలో ప్రచార కమిటీ కన్వీనర్ వొడ్నాల శ్రీనివాస్, గుడి అశోక్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆ తదుపరి ఎస్ సి సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం ఆధ్వర్యంలో మాతా శిశు ఆస్పత్రిలో కేక్ కట్ చేసి బాలింతలు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతూ మచ్చ లేని విలక్షణ వ్యక్తిత్వం గల నాయకుడు మంత్రి శ్రీధర్ బాబు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎంపిపి కొండ శంకర్, మున్సిపల్ చైర్పర్సన్ పెంద్రి రమ-సురేష్ రెడ్డి, టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ మెంబర్ శశిభూషణ్ కాచే, మున్సిపల్ అధ్యక్షుడు పోలు శివ, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ పెంటరి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు నూకల బాణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగారావు, బిసి సెల్ డివిజన్ అధ్యక్షుడు గొటికార్ కిషన్, ఐఎన్టీయూసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేరవేన లింగయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకన్న, డివిజన్ యూత్ ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజు, అజీంఖాన్,నాయకులు మంథని శ్రీనివాస్, మండల యూత్ ఉపాధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్, రేపాక శ్రీకాంత్, మున్సిపల్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాదుల శ్రీకాంత్, ఎరుకల రమేష్ బాబు, మోహన్ సాయి, పర్శవేన మోహన్, ఊదరి శంకర్, సింగిల్ విండో డైరెక్టర్లు రావికంటి సతీష్ కుమార్, కొత్త శ్రీనివాస్, నాయకులు ఊట్ల అనిల్, అరెల్లి కిరణ్ గౌడ్, ఇసంపల్లి రా జేశ్వర్, ఆకుల కిరణ్, కూర కోటేష్, మంథని సురేష్, వొడ్నాల ప్రవళిక, రాం రాజశేఖర్, ఎండి. జాఫర్, బూడిద రా జు, మాజీ సర్పంచులు రమేష్, రాయమల్లు, నాగుల రాజయ్య, దొరగొర్ల శ్రీనివాస్, ఉషన్ బీ, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పాలు విరిగాయని భార్యను చితకబాదిన భర్త

హైదరాబాద్,కట్టుకున్న భర్తే కిరాతకుడిగా మారాడు. పొయ్యిపై వేడి చేసిన పాలు విరిగాయన్న నెపంతో అత్తింటి వారు ఆ అబలపై తమ ప్రతాపం చూపారు. అదనపు కట్నం తెమ్మంటూ రాచి రంపాన పెట్టారు. ఒళ్లంతా వాతలు తేలేలా మెటల్ పైపుతో మూడ్రోజుల పాటు కొట్టి నరకం చూపారు. ఈ అమానవీయమైన ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సనత్నగర్ అల్లాఉద్దీన్ కోఠికి చెందిన హీనా బేగం(28) వివాహం నాలుగేళ్ల కిందట ఎల్లారెడ్డిగూడకు చెందిన కారు డ్రైవర్ అక్మల్ హుస్సేన్(42)తో పెద్దల సమక్షంలో జరిగింది. కట్నకానుకల కింద రూ.2 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం, ఇతర లాంచనాలు ఇచ్చి ఘనంగా పెండ్లి చేశారు. అప్పటికే అక్మల్ హుస్సేన్కు మొదట పెండ్లి అయిన విషయాన్ని దాచిపెట్టారు. తర్వాత బేగంకు తెలిసినా సర్దుకుని కాపురం చేయసాగింది. కొన్నేళ్ల పాటు వీరి కాపురం సజావుగానే సాగడంతో ఓ కుమారుడు, కుమార్తె జన్మించారు. పెండ్లి అయినప్పటి నుంచి భర్త అక్మల్ హుస్సేన్, అత్త అఫ్రోజ్ బేగం, ఆడపడుచు సోని, మరుదులు తబ్రేజ్, అయ్యూబ్ కలిసి హీనాను శారీరకంగా,మానసికంగా హింసించారు. పుట్టింటి నుంచి అదనపు కట్నం తేవాలని ఆమెను చీటికిమాటికి కొట్టారు. కూతురు కాపురం బాగుపడుతుందన్న ఆశతో అప్పు చేసి రూ.2.50 లక్షలు వరకు అత్తింటి వారికి ముట్టజెప్పారు. అయినా అత్తింటి వారి వేధింపులు తగ్గలేదు. కాగా, అత్తింట్లో పొయ్యిపై పాలు వేడి చేసి మరిగించే సమయంలో పాలు విరిగిపోయాయి. దీంతో ఆగ్రహానికి గురైన భర్త, అత్త, ఆడపడుచు, మరిది కలిసి ఆమెపై మెటల్ పైపుతో విచక్షణారహితంగా చితకబాది, ఇంట్లోనే మూడ్రోజుల పాటు నిర్బంధించారు. ఒళ్లంతా గాయాల తో కమిలిపోయింది. మీ కూతురు చనిపోయిందంటూ ఆమె పుట్టింటి వారికి ఫోన్ చేసి చెప్పారు. అపస్మారకస్థితిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కుమార్తెను చూసిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. అత్తింటివారి దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని చికిత్స నిమిత్తం అమీర్పేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రధాని మోదీ వ్యాఖ్యలను తప్పుపట్టిన మన్మోహన్ సింగ్



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి కార్యాలయం హుందాతనాన్ని ప్రధాని మోదీ అగౌరవపరిచినట్లు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు. ఒక వర్గాన్ని లేదా విపక్షాన్ని టార్గెట్ చేసేందుకు.. ప్రధాని మోదీ ద్వేషపూరిత, అప్రజాస్వామిక ప్రసంగాలు చేసినట్లు మన్మోహన్ ఆరోపించారు. పంజాబ్ ప్రజలకు రాసిన లేఖలో మన్మోహన్ సింగ్ ఈ ఆరోపణలు చేశారు. జనాలను రెచ్చగొట్టే ఉద్దేశంతో చాలా విషపూరితమైన విద్వేష ప్రసంగాలను ప్రధాని మోదీ చేసినట్లు మన్మోహన్ ఆ లేఖలో పేర్కొన్నారు.ఇటీవల లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న మోదీ.. రాజస్థాన్‌లో జరిగిన ఓ సభలో మాట్లాడుతూ ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి దేశ సంపదను దోచిపెడుతారని ఆరోపించారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రధాని మోదీ ప్రామిస్ చేశారని, కానీ గడిచిన పదేళ్లలో రైతులు ఆదాయం తగ్గిపోయిందని మన్మోహన్ ఆరోపించారు. రైతుల రోజువారి సగటు ఆదాయం రూ.27 అని, కానీ సగటున రైతుల అప్పు 27 వేల ఉంటోందని, ఇంధనం-ఫర్టిలైజర్ల ధరలు పెరుగుతున్నాయని, దీనికి తోడు జీఎస్టీ జత కలుస్తోందని, ఫలితంగా రైతుల ఇండ్లల్లో డబ్బు ఆదా తగ్గిపోయినట్లు మన్మోహన్ తెలిపారు.గడిచిన పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ లోపాలు, కోవిడ్‌లో మిస్ మేనేజ్మెంట్ వల్ల జీడీపీ వృద్ధిపై ప్రభావం పడినట్లు ఆయన అన్నారు. 2020-21లో జరిగిన రైతుల నిరసన ప్రదర్శన పట్ల బీజేపీ వ్యవహరించిన తీరును మన్మోహన్ ఖండించారు. ఢిల్లీ సరిహద్దులో నిరీక్షిస్తూ 750 మంది పంజాబీ రైతులు ప్రాణాలు కోల్పోయారని, లాఠీలు, బుల్లెట్ల దెబ్బలకు రైతులు బలి అవుతుంటే, ఆందోళన చేస్తున్న ఆ రైతులను ఆందోళనజీవులు, పరాన్నజీవులంటూ మోదీ హేళన చేసినట్లు మన్మోహన్ తెలిపారు.మూడు సాగు చట్టాలను వెనక్కి తీసుకోవాలని మాత్రమే పంజాబీ రైతులు డిమాండ్ చేశారని, కానీ బీజేపీ సర్కారు పంజాబీలను పట్టించుకోలేదని మన్మోహన్ అన్నారు.

## ఉపాధి హామీ పనుల్లో నిజాం కాలంనాటి నాణేలు లభ్యం



సిద్దిపేట : సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయిపల్లి గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు ఓ రాతి పాత్ర దొరికింది. దీంతో తొలుత రాతి పాత్రను ఓపెన్ చేసేందుకు కూలీలు భయపడ్డారు. కొంతమంది కూలీలు దానిని తెరిచి చూశారు. ఆ పాత్రలో పురాతన కాలం నాటి 25 వెండి నాణేలు, రెండు వెండి ఉంగరాలు లభ్యమయ్యాయి.పురాతన నాణెములు దొరికిన విషయాన్ని గ్రామస్తులు బహిర్గతం చేయగా చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో రామ్మోహన్ తదితర అధికారులు గ్రామానికి చేరుకొని, కూలీలకు దొరికిన నాణేలను పరిశీలించారు. ఇవి నిజాం కాలం నాటి నాణెములుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ నాణెములు, ఉంగరాలను పురావస్తు శాఖకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

## కబేళాలో పని చేస్తున్న పిల్లలు.. 57 మందిని రక్షించిన పోలీసులు

లక్నో: కబేళాలో పిల్లలు పని చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో పోలీసులు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు కలిసి తనిఖీలు చేశారు. 57 మంది బాలురు, బాలికలను రక్షించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ముస్సోరీ ప్రాంతంలో యాసిన్ ఖురేషీకి చెందిన అంతర్జాతీయ వ్యవసాయ, ఆహార కబేళాలో మైనర్లు పని చేస్తున్నట్లు మిషన్ ముక్తి సంస్థ ద్వారా పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో బుధవారం ఆ వధశాలపై పోలీసులు రైడ్ చేశారు. 31 మంది బాలికలు, 26 మంది బాలురతో సహా 57 మంది పిల్లలను రక్షించారు.కాగా, పిల్లలతో జంతువులను వధించడం, మాంసాన్ని ప్యాక్ చేయించడం వంటి పనులను అక్కడ చేయిస్తున్నారని పోలీసులు ఆరోపించారు. పని చేస్తున్న మరి కొందరి వయస్సును నిర్ధారించాల్సి ఉందని తెలిపారు. పశ్చిమ బెంగాల్, బీహార్‌లోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలను ఇక్కడ పనికి కుదిర్చిన వ్యక్తులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పిల్లలతో పని చేయించడంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.



# పదేళ్లలో... ఏపీ అంతఅంత మాత్రమే...

విజయవాడ, మే 30, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రజలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారు.. సీమాంధ్ర ప్రజలు అసలు సమైక్యాంధ్ర కోసం పోరాడారు. గతంలో ఉద్యమం జరిగినప్పుడు జై ఆంధ్ర పోరాటం చేశారు. కానీ ఈ సారి మాత్రం.. సమైక్యంగా ఉండాలని పోరాడారు. అయితే పెరిగిపోతున్న ప్రాంతీయ ఆకాంక్షల కారణంగా రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడం సాధ్యం కావడం లేదంటూ అప్పటి యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు చేసింది. విభజన ఎలా జరిగింది.. అన్న విషయాన్ని పక్కన పెడితే విభజన అనేది నిజం. అది జరిగి కూడా పదేళ్లు అవుతోంది. ఇప్పుడు పదేళ్లు వెనక్కి తిరిగి చూస్తే ఏపీ ఎక్కడ ఉంది.. విభజన గాయాన్ని మాన్పుకుని తిరిగి ప్రస్థానం ప్రారంభించిందా ?రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లను ఎదుర్కొంది. అవశేష ఆంధ్రప్రదేశ్ గా మిగిలింది. ఈ క్రమంలో పదేళ్లలో రెండు ప్రభుత్వాలు వేర్వేరు పార్టీలవి ఏర్పడటం.. రెండు ప్రభుత్వాల తీరు భిన్నమైనవి కావడంతో ఏపీ పూర్తిగా చితికిపోయిందని అనుకోవచ్చు. మొదటగా బాధ్యతలు చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం ఏపీకి అమరావతిని రాజధానిగా నిర్ణయించి.. ఓ కొత్త మోడల్ తో అభివృద్ధి ప్రస్థానాన్ని ప్రారంభించాలని అనుకుంది. ఐదేళ్లలో చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుతో పాటు అమరావతిని సమాంతరంగా నిర్మిస్తూ ముందుకెళ్లారు. కానీ ఐదేళ్లకే ప్రజలు వేరే విధంగా ఆలోచించారు. చంద్రబాబుకు ఘోర పరాజయాన్ని ఇచ్చి జగన్మోహన్ రెడ్డి చేతుల్లో రాష్ట్రాన్ని పెట్టారు. అయితే జగన్ ప్రాధాన్యాలు వేరు. ఆయన పూర్తిగా సంక్షేమాన్ని మాత్రమే నమ్ముకున్నారు. బటన్ నొక్కే పథకాలకే ప్రాధాన్యం ఇచ్చారు. ఫలితంగా ఏపీ ఐదేళ్ల కిందట ఎలా ఉందో.. అక్కడే ఉంది.. ఇంకా చెప్పాలంటే.. వెనుకబడిపోయిందని అనుకోవచ్చు. రాజధానిగా అసెంబ్లీలో ఏకగ్రీవంగా అమరావతిని ఖరారు చేసినప్పటికీ .. అలా అంగీకరించిన వారే తర్వాత మూడు రాజధానుల పేరుతో మడమ తిప్పేయడంతో రాజధాని పరిస్థితి గందరగోళంలో పడిపోయింది. అమరావతి పేరుతో రైతుల వద్ద నుంచి భూములు సేకరించకపోయి ఉన్నట్లయితే.. జగన్ ఎక్కడ రాజధాని కావాలంటే అక్కడ ఏర్పాటు చేసుకుని ఉండేవారు. కానీ రాజధాని రైతులతో చేసుకున్న ఒప్పందాలతో ఆయన మూడు రాజధానుల విషయంలో ముందడుగు వేయలేకపోయారు. రైతులకు పరిహారం ఇచ్చి తన రాజధానుల కల నెరవేర్చుకున్నా సమస్య ఉండేది కాదు. కానీ అలా కూడా చేయలేదే?. ఫలితంగా ఏపీకి రాజధాని లేదు. పోలవరం ప్రాజెక్టు విషయంలోనూ అంతే. నవయుగ సంస్థ శరవేగంగా నిర్మిస్తున్న ప్రాజెక్టును తాను రాగానే రివర్స్ టెండరింగ్ పేరుతో మేఘా సంస్థకు కట్టబెట్టంతో ప్రాజెక్టు నిర్మాణం ఆగిపోయింది. నిర్మాణం అసలు ముందుకు సాగలేదు. ఫలితంగా కొత్త సమస్యలు వచ్చాయి. ఆర్ అండ్ ఆర్ సంగతి తేలడం లేదు. ఫలితంగా తాము అధికారంలోకి వస్తే రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పిన ప్రాజెక్టును.. మరోసారి ఎన్నికలకు వెళ్తూ వచ్చే ఐదేళ్లలో పూర్తి చేస్తామని చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. మొదటి ఐదేళ్లు ఆశాజనకంగా ఉన్న అమరావతి, పోలవరం. తర్వాత ఐదేళ్లు పడకేశాయి. ఈ విషయాల్లో ఏపీ పూర్తి స్థాయిలో వెనుకబడిపోయింది. ఏపీ వ్యవసాయ అధారిత రాష్ట్రంగా మారింది. పరిశ్రమలు పెద్దగా లేవు, మొదటి ఐదేళ్లు తెలుగుదేశం హయాంలో సీఎం చంద్రబాబు పరిశ్రమల్ని ఆకర్షించేందుకు విస్తృత ప్రయత్నాలు చేశారు. కియా లాంటి అతి పెద్ద విదేశీ పెట్టుబడుల్ని తీసుకు వచ్చారు. విశాఖ , విజయవాడ,తిరుపతి లాంటి చోట్లకు భిన్న రంగాల పరిశ్రమల్ని ఆకర్షించారు.తిరుపతిని ఎలక్ట్రానిక్ హబ్ గా మార్చే ప్రయత్నంలో అనేక పరిశ్రమల్ని ఆకర్షించారు. పారిశ్రామికీకరణ ఊపందుకుంటోందనుకున్న దశలో ప్రభుత్వం మారింది. జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం ప్రాధాన్యతలు వేరు కావడంతో పరిశ్రమలు కూడా పెద్దగా రాలేదు. సంప్రదాయేతర ఇంధన విద్యుత్ సంస్థల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం చెబుతోంది కానీ.. యువతకు ఉపాధి లభించే పరిశ్రమలు మాత్రం పెద్దగా రాలేదు. పెద్ద పరిశ్రమలపై తమకు నమ్మకం లేదని.. చిన్న చిన్న వాటిని ప్రోత్సాహిస్తామని సీఎం జగన్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ పాలసీనే నడవడంతో.. గత ఐదేళ్లలో ఏపికి వచ్చిన పరిశ్రమలు, ఉద్యోగావకాశాలు లేవు. అలాగే విద్య కోసం కోసం కూడా విద్యార్థులు పెద్ద ఎత్తున పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నారు. ఇంటర్ వరకూ ఏపీలో చదువుకున్నా.. పై స్థాయి అవకాశాల కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. విభజన కారణంగా నష్టపోతున్న ఏపీ కోసం విభజన చట్టంలో భాగంగా కేంద్రం ప్రకటించిన కొన్ని సంస్థలు మాత్రం ఈ పదేళ్లలో పూర్తయ్యాయి. విజయవాడలో ఎయిమ్స్ తో పాటు తిరుపతిలో ఐఐటీ సహా విశాఖ, అనంతపురం సహా పలు జాతీయ స్థాయి విద్యా సంస్థలు వచ్చాయి. గిరిజన యూనివర్సిటీ పనులు జరుగుతున్నాయి. ఈ విద్యా సంస్థలు తప్ప.. పరిశ్రమలు ప్రత్యేకంగా ఏమీ రాలేదు. కడప స్టీల్ ఫ్యాక్టరీ తప్ప ఏదీ మెటీరియలైజ్ కాలేదు. మొత్తంగా పదేళ్ల కాలంలో ఏపీలో రెండు రకాల ప్రభుత్వాలు ఏర్పడటంతో.. ఎవరి అజెండా వారు అమలు చేయడంతో ఏపీ నష్టపోయింది తప్ప పురోగతి సాధించిందేమీ లేదని అనుకోవచ్చు.

## పోరు బందరు ఎవరికి

విజయవాడ, మే 30,ఆ నియోజకవర్గంలో వరుసగా ఏడో సారి ఆ ఫ్యామిలీ మెంబరే పోటీ చేశారు. వైసీపీ నుంచి ఆ కుటుంబానికి చెందిన మూడో తరం ఈసారి బరిలోకి దిగారు. టీడీపీ నుంచి పాత అభ్యర్థే నాలుగోసారి పోటీ చేశారు. ఈ సారి కూడా ఆ రెండు కుటుంబాలకు చెందిన అభ్యర్థులే పోటీలో ఉండడంతో ఏ కుటుంబానికి చెందిన వ్యక్తి అసెంబ్లీలో అడుగు పెడతారా అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వైసీపీ నుంచి పోటీ చేస్తున్న కొత్త నాయకుడు అసెంబ్లీలో అధ్యక్ష అంటారా? లేక టీడీపీ పాతకాపుమళ్లీ అసెంబ్లీలో అడుగు పెడతారా? అన్న ఉత్కంఠ నియోజకవర్గవాసుల్లో నెలకొంది. ఇంతకీ ఆ నియోజకవర్గం ఏది..? అక్కడ పోటీ చేసిందెవరంటారా..ఉమ్మడి కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం.. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పటి నుంచి జిల్లా హెడ్‌క్వార్ట్ అయిన మచిలీపట్నంలో ఈ సారి ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. వైసీపీ నుంచి ఈ సారి మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య అలియాస్ పేర్ని నాని కుమారుడు పేర్ని కిట్టు పోటీ చేశారు. పేర్నినాని పొలిటికల్ రిటైర్‌మెంట్ తీసుకుని తన తనయుడి విజయం కోసం ప్రచారం చేశారు. పేర్ని నాని సైతం తన తండ్రి పేర్ని క?ష్ణమూర్తి వారసత్వాన్ని అందిపుచ్చుకునే రాజకీయాల్లోకి వచ్చారు.టీడీపీ ఆవిర్భావం నుంచి మచిలీపట్నంలో పేర్ని ఫ్యామిలీ ఆ పార్టీకి ప్రత్యర్థిగా ఉంటూ వచ్చింది. 1983లో మొదటి సారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పేర్ని నాని తండ్రి ఓడిపోయారు. 1989లో మొదటి సారిగెలిచిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 1994లో తండ్రి తిరిగి ఓడిపోవడంతో 1999 నాటికి పేర్ని నాని పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. మొదటిసారి పోటీ చేసి ఓడిపోయిన పేర్ని నాని 2004లో విజయం దక్కించుకున్నారు.. 2009లో కాంగ్రెస్ నుంచి మరోసారి గెలిచిన ఆయన మారిన రాజకీయ పరిణామాలతో జగన్ బాట్ పట్టారు. 2014లో ఓఢిపోయి.. 2019లో గెలుపొందిన నాని వైసీపీ ప్రభుత్వంలో రెండున్నరేళ్ళ మంత్రిగా పనిచేశారు.. ఈ సారి తన తనయుడు పేర్ని కిట్టూని పొలిటికల్ స్క్రీన్ మీదకి తీసుకొచ్చారు.పేర్ని నాని తండ్రికి రాజకీయ ప్రత్యర్థిగా నడకుదుటి నరసింహారావు మచిలీపట్నం రాజకీయాల్లో చక్రం తిప్పారు. తర్వాత ఆయన 1999లో పేర్ని నానిని కూడా ఓడించారు. నడకుదిటి రాజకీయ వారసత్వాన్ని మచిలీపట్నంలో ఆయన మేనల్లుడు కొల్లు రవీంద్ర కొనసాగిస్తున్నారు. 2009లో మొదటి సారి టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయని కొల్లు రవీంద్ర.. 2014లో పేర్ని నానిని ఓడించి చంద్రబాబు కేబినెట్‌లో పనిచేశారు. గత ఎన్నికల్లో పేర్ని నాని చేతిలో ఓడిపోయిన ఆయన.. ఈ సారి పేర్ని మూడో తరం వారసుడితో పోటీ పడ్డారు. ప్రచారంలో టీడీపీ మేనిఫెస్టోని హైలెట్ చేస్తూ దూసుకుపోయారు.ఈ ఫ్యామిలీ వారే ఇప్పుడు బందరు వాసుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం వైసీపీ నుంచి పేర్ని కిట్టు మొదటిసారి పోటీ చేస్తున్నారు. ఆయన తండ్రి, తాత మొదటిసారి పోటీ చేసినప్పుడు ఓడిపోయారు. ఆ చరిత్రను పేర్ని కిట్టు మారుస్తారా లేదా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు తాత, తండ్రి అయిపోయారు ఇప్పుడు కొడుకొచ్చాడు. ఎప్పుడూ ఆ కుటుంబాన్నే మోయాలా? అన్ని సన్నాయినొక్కులు కూడా పోలింగ్ బూత్‌ల దగ్గర వినిపించాయంటఇక మంత్రిగా ఉన్నప్పుడు పేర్ని నానిపై పెరిగిన ప్రజా వ్యతిరేకత కిట్టు విజయంపై ప్రభావం చూపించే అవకాశాల్ని కొట్టిపారేయలేం అంటున్నారు విశ్లేషకులు.. ఆ వ్యతిరేకత భయంతోనే పేర్ని నాని ఈసారి పోటీకి దూరమై.. కొడుక్కి అవకాశమిచ్చారన్న టాక్ కూడా వినిపిస్తుంది. అదీకాక వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా దాడులు, అరాచకాలు , అక్రమాలు పెరిగిపోయి. పట్టణంలో ప్రశాంతత కరువైందన్న విమర్శలున్నాయి. పోలీసుల అండతో వైసీపీ శ్రేణులు ఇష్టానుసారం చెలాయించుకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరిలాంటి పరిస్థితుల్లో బందరు ఓటర్లు ఈ సారి పోటీ పడిన వారసుల్లో ఎవర్ని ఆదిరిస్తారో చూడాలి.

## ఏపీలో అంత వీజీఏం కాదు

విజయవాడ, మే 30, ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పాలన అంతా ఈజీ కాదు. ఇప్పటికే ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ప్రజాభిప్రాయం ఈవీఎంలలో నిక్షిప్తం అయ్యింది. జూన్ 4న ఫలితాలు రానున్నాయి. జూన్ 9 నుంచి కొత్త ప్రభుత్వం పాలన ప్రారంభం కానుంది. అయితే ఇచ్చిన హామీలు, అభివృద్ధి, ఉద్యోగాల కల్పన వంటి అమలు ఆషామాషీ విషయం కాదు. కనీసం కొత్త ప్రభుత్వం కుదుటుపడాలంటే, పాలన గాడిలో పడాలంటే దాదాపు రెండు సంవత్సరాల కాలం పట్టడం ఖాయం. అయితే జగన్ అధికారంలోకి వస్తే.. ఇప్పుడున్న దానికి కొనసాగింపు ఉంటుంది. అదే కూటమి అధికారంలోకి వస్తే మాత్రం.. చంద్రబాబుకు కత్తి మీద సామే.విపక్షాలు ఆరోపిస్తున్నట్టు ఏపీ సర్కార్ కు 12 లక్షల కోట్ల అప్పు ఉంది. ఈ అప్పును భరించాల్సిన అవసరం కొత్త ప్రభుత్వం పై ఉంది. కూటమి అధికారంలోకి వస్తే పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుస్తామని కూడా చెప్పుకొచ్చారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి ఇంట్లో ఆర్థిక భరోసా, పిల్లల చదువుకు ప్రోత్సాహం, సాగుకు పెట్టుబడి నిధి వంటి భారీ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని కూటమి మేనిఫెస్టోలో పెట్టింది. ఇవన్నీ అమలు చేయడం కష్టతరం.అసలు సంక్షేమానికి దూరంగా ఉండే చంద్రబాబు.. అధికారంలోకి వచ్చేందుకు తప్పనిసరి అయి పెద్ద ఎత్తున పథకాలు ప్రకటించారు. వీటన్నింటినీ అమలు చేస్తారా? చేయలేరా? లేకుంటే ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది.రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల మంది సామాజిక పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. నాలుగు వేలకు పింఛన్ మొత్తాన్ని పెంచుతానని ప్రకటించారు. దివ్యాంగులకు, కిడ్నీ బాధితులకు పింఛన్ మొత్తాన్ని పెంచుతామని కూడా చెప్పుకొచ్చారు. వాటిని అమలు చేయాలంటే కష్టతరంతో కూడుకున్న పని. మరోవైపు అభివృద్ధి చేపట్టాల్సి ఉంది. అమరావతి రాజధానిని డెవలప్ చేయాలి. ఒకవైపు సంపద పెంచుతూనే.. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇవ్వాలి. ఉన్నది ఐదు సంవత్సరాల గడువు మాత్రమే.

## నంజంపేటలో ఇరువర్గాల ఘర్షణ..

చిత్తూరు,శాంతిపురం మండల పరిధిలోని నంజంపేటలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తమ కుటుంబంపై నంజంపేట గ్రామానికి చెందిన సుమారు 15 మంది దాడి చేశారని వీసికే ఎమ్మెల్యే అభ్యర్థి గోవిందప్ప ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తన తమ్ముడు కృష్ణమూర్తి బెంగళూరు నుండి తమ గ్రామమైన గట్టూరుకు వెళ్తుండగా కారుపై రాళ్ళతో దాడి చేసారన్నారు. రాళ్లతో కారు పై ఎందుకు దాడి చేశారని ప్రశ్నించినందుకు కర్రలు, రాళ్లతో దాడి చేశారని తెలిపారు. గతంలో రెండుసార్లు దాడికి పాల్పడ్డారని తెలిపారు. నంజంపేట గ్రామా నికి చెందిన ఉమాశంకర్, బాలాజీ, నాగభూషణం తదితరులు నిన్న రాత్రి రాళ్లు, కర్రలతో దాడి చేశారనీ పేర్కొన్నారు. ఈ ఘర్షణలో తమకుటుంబ సభ్యులకు తీవ్రగాయాలు అయింద న్నారు. చికిత్స నిమిత్తం గాయపడిన వారిని కుప్పం పి.ఈ.ఏస్ ఆసుపత్రికి తరలించారు. ఘర్షణకు గల కారణాలు రాళ్లబుదుగూరు

## నిరూపయోగంగా మారిన పర్యటక భవన్

కోటిపల్లి,టూరిజం అభివృద్ధిలో భాగంగా కోట్ల రూపాయలు వెచ్చించి ఆధునిక హంగులతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కోటిపల్లిలో నిర్మించిన పర్యాటక భవనం నిరుపయోగంగా మారింది. 2013 వ సంవత్సరంలో అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి చిరంజీవి చేతుల మీదుగా ఐదు కోట్ల రూపాయల వ్యయంతో పర్యాటక భవనాన్ని కోటిపల్లి గోదావరి తీరంలో నిర్మించారు. 2019లో అప్పటి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రియనమల రామకృ ష్ణుడు ఈ భవనాన్ని ప్రారంభిం చారు. అయితే అప్పటి నుంచి భవనం వినియోగంలోకి రాకపోగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వినియోగం లోకి రాకుండానే అధికా రుల అలసత్వం వల్ల భవనం రూపు రేఖలు మారిపోయింది. ఇప్పటికైనా ఈ పర్యాటక భవనాన్ని అందుబా టులోకి తీసుకొచ్చి పర్యాటకులకు ఉపయోగపడే విధంగా స్పందించాలని స్థానికులు కోరుతు న్నారు.

## ఉరవకొండలో హాట్ హాట్‌గా చర్చలు

ఉరవకొండ ఈసారి ఎన్నికల ఫలితాల ప్రకటనలో అనంతపురం జిల్లా లోని, ఉరవకొండ నియోజకవర్గంలో గెలుపు ఓటముల గురించి ఆసక్తి కరమైన చర్చలు జరుగుతున్నాయి. ఇక్కడ ఉమ్మడి అభ్యర్థి గా పయ్యావుల కేశవ్,వైసీపీ అభ్యర్థి గా వై.విశ్వేశ్వర్ రెడ్డి బరిలో ఉన్నారు. దీంతో ఇక్కడి అభ్యర్థుల గెలుపోటములపై ప్రజల్లో ఉత్కంఠ ఎక్కువగా ఉంది. కొన్ని దశాబ్దాలుగా ఉరవకొండ నియోజక వర్గంలో పయ్యావుల కేశవ్, వై.విశ్వేశ్వర్ రెడ్డి మధ్య హోరాహోరీగా పోరు నడుస్తోంది.' నుంచీ ఇద్దరూ పట్టుదలకు పోతున్నారు. రీ కౌంటింగ్ కోసం పట్టుబట్టడం, చెల్లని ఓట్లపై పేచీలు పెట్టుకోవ డం,సంతకాలు చేయకుండా మొరాయించడం...చేస్తుంటారు. పయ్యావుల, విశ్వ ల మధ్య హోరాహోరీతో అర్ధరాత్రి వరకు హైడ్రామా నడిచేది. ప్రతి ఎన్నికల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉంటుది. అందుకు ప్రతిసారి తుది ఫలితం ఉరవకొండ నియోజకవర్గం నుంచే వచ్చేది. ఈసారి అటువంటి సంఘటనలు జరగకుండా... ఇందుకోసం పటిష్ట బందోబస్తు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. కు భిన్నంగా ఉరవకొండ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# బావ,బామ్మర్దుల సవాల్

శ్రీకాకుళం, మే 30, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గ రాజకీయాలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ పై వైసీపీ తరుపున తమ్మినేని సీతారాం గెలుపొంది ప్రస్తుతం ఏపీ శాసనసభపతిగా కొనసాగుతున్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ సెగ్మెంట్ టీడీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ విప్ కూన రవికుమార్, తమ్మినేనికి సొంత మేనల్లుడు.. కూన రవికుమార్ అక్కనే తమ్మినేని సీతారాం వివాహం చేసుకున్నారు. 2024 ఎన్నికల్లోనూ వరుసగా నాలుగోసారి అముదాలవలసలో ఆ మామాఅల్లుళ్లు తలపడుతున్నారు2009లో తమ్మినేని టిడిపిని వీడి ప్రజారాజ్యం తరఫున బరిలోకి దిగగా? టిడిపి అభ్యర్థిగా కూన రవి కుమార్ మొదటిసారి అసెంబ్లీ బరిలో ఆయనపై పోటీ చేశారు?ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో మామ అల్లుళ్ళు ఇద్దరు ఓటమిపాలయ్యారు. తరువాత 2014లో తమ్మినేని వైసీపీ తరఫున, కూన రవి టిడిపి తరఫున ప్రత్యక్ష పోరుకు దిగగా కూన రవి కుమార్ గెలుపొందారు. ఈ ఇరువురు నేతల మధ్య బంధుత్వం 2014 ఎన్నికల నుంచి పొలిటికల్ వైరానికి దారితీసింది.సీనియర్ నేతైన తమ్మినేని సీతారాం ఏడుసార్లు ఆమదాలవలస అసెంబ్లీ స్థానం నుండి ఎంఎల్ఏ గా గెలుపొందారు. టిడిపి ప్రభుత్వ హయాంలో వివిధ శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. 1999 ఎన్నికల తర్వాత తమ్మినేని చాలా కాలం అసెంబ్లీ మెట్లు ఎక్కలేకపోయారు. 2004, 2009, 2014 ఎన్నికల్లో వరుసగా ఓటమిని చూసిన తమ్మినేని.. 2019లో వైసిపి తరుపున గెలుపొంది శాసనసభ స్పీకర్ అయ్యారు. 2024 ఎన్నికల్లోనూ మామ అల్లుళ్లే ప్రధాన ప్రత్యర్థులుగా తలపడటం ఆసక్తికరంగా మారింది. ఇద్దరు నేతల మధ్య మాటలతూటాలు ఒక రేంజ్లో పేలాయి. సవాళ్లు ప్రతి సవాళ్లతో ఆమదాలవలస రాజకీయాలను హీటెక్కించారు.తమ్మినేని సీతారాం పెద్ద అవినీతిపరుడని అంగన్వాడీ , షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులను అమ్ముకున్నారని, అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని కూన రవి ఆరోపిస్తే.. టీడీపి హయాంలో పురుషోత్తపురం అక్రమ ఇసుక ర్యాంప్, ఆమదాలవలస భూ ఆక్రమణ, వెన్నెలవలసలో కూనవారిపూలతోట పేరిట వంద ఎకరాల ప్రభుత్వ భూఆక్రమణకు యత్నించటం వంటి అక్రమాల మాటేంటని ఇటు తమ్మినేని కూన రవిని ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలపైన, అభివృద్ధి పై బహిరంగ చర్చకు రావాలని పరస్పర సవాళ్లు విసురుకున్నారు.వైసిపికి విశేష ప్రజాదరణ ఉందని 2024 ఎన్నికల్లో తనకు 20వేలకు పైబడి మెజారిటీ వస్తుందని తమ్మినేని ధీమా వ్యక్తం చేశారు. 20వేలకు పైబడి మెజారిటీ రాకపోతే తాను ఇక ఎన్నికల్లో పోటీ చేయనని కూడా ప్రకటించారు. అయితే



తమ్మినేనికి ఆరోగ్యం క్షీణించి తనకు వచ్చే మెజారిటీని ఆయనకు వస్తుందని రివర్స్ లో చెబుతున్నారని ఎద్దేవా చేశారు కూన రవికుమార్.. ఆమదాలవలసకు ఒక ఎమ్మెల్యే కావాలా లేక ముగ్గురు ఎమ్మెల్యే లు కావాలో నిర్ణయించుకోవాలని నియోజకవర్గ ప్రజలకు కూన రవి సూచించారు.తమ్మినేని గెలిస్తే అతను, అతని భార్య వాణి, అతని కుమారుడు చిరంజీవి నాగ్ అధికారం చెలాయిస్తారని మూడు కలెక్షన్ సెంటర్లు ఏర్పడతాయని కూన రవి ఆరోపణలు గుప్పించారు. అయితే తనతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజాసేవకు అంకితవుతున్న తన కుటుంబ సభ్యులపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు తమ్మినేని.పెరిగిన నిత్యావసరాల ధరలు, ప్రభుత్వ ఇసుక, మద్యం విధానాలలో డొల్లతనం, అవినీతి, పడకేసిన అభివృద్ధితో ప్రజలు విసిగివేశారారని, ఈ ఎన్నికల్లో వైసిపిని గద్దె దించేందుకు ప్రజలు రెడీగా ఉన్నారని కూన రవి తన గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. వారి అభివృద్ధికి మధ్యలోనే నిలిచిపోయిన శ్రీకాకుళం, ఆమదాలవలస ప్రధాన రహదారి విస్తరణ పనులే నిదర్శనమని కూన రవికుమార్ దెప్పిపొడిచారు. ఆమదాలవలస శ్రీకాకుళం రోడ్‌కి టిడిపి హయాం లో 37 కోట్లు కేటాయిస్తే.. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ నిధులను నాయకులు స్వాహా చేయడమే కాకుండా.. ఐదేళ్లు అయినా ఆ రోడ్ ని అలాగే వదిలేసారని కూన రవికుమార్ తమ్మినేని పై మండిపడ్డారు.ఆమదాలవలస ..శ్రీకాకుళంరోడ్ వేయడానికి ముందుకి వచ్చిన కాంట్రక్టర్ దగ్గర స్పీకర్ తమ్మినేని సీతారాం 2 కోట్లు నొక్కేసారని తమ్మినేని సీతారాంపై ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఆ 2 కోట్లు తోనే తన కొడుకు పెళ్లి చేశారని కూన రవికుమార్ పదేపదే టార్గెట్ చేస్తున్నారు .. తమ్మినేని సీతారాం అవినీతి వలనే ఆమదాలవలస.. శ్రీకాకుళం రోడ్ పూర్తి కాలేదని.. రోడ్ పై ఇప్పటి వరకు 30 మంది చనిపోయారని కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఆ మామా అల్లుళ్ళ పోరుకు తోడు వైసీపీ అసమ్మతి నేతలు రంగంలోకి దిగి తమ్మినేనికి షాక్ ఇచ్చారు. కుటుంబ పాలన వద్దు.. సువ్వారి గాంధీ ముద్దు అంటూ స్వతంత్ర్య అభ్యర్థిగా వైసిపి రెబల్ గాంధీ పోటీకి దిగారు. అముదాలవలస వైసీపీ టికెట్ కోసం వైసిపి నేత సువ్వారి గాంధీ, జోనల్ వైసీపీ ప్రచార విభాగం ఇంచార్జ్ చింతాడ రవికుమార్‌లు తమ్మినేనితో పోటీ పడ్డారు.. దాంతో వైసీపీలో మూడు గ్రూపులు వెలిశాయి. అయితే పార్టీ అధిష్టానం టికెట్ ను తమ్మినేనికి కేటాయించడంతో వెంటనే గాంధీ, అతని భార్య మాజీ ఎంపీపీ దివ్య, అతని మరదలు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్పర్సన్ సువర్ణ పార్టీకి, పదవులకు రాజీనామా చేసేశారు. అనంతరం గాంధీ స్వతంత్ర్య అభ్యర్థిగా ఎన్నికల్లో దిగుతున్నట్లు ప్రకటించి విస్తృత ప్రచారం నిర్వహించారుమరోవైపు చింతాడ రవికుమార్‌ను పార్టీ పెద్దలు బుజ్జగించి.. తమ్మినేనికి అనుకూలంగా పనిచేసేలా ఒప్పించారు? అయితే గాంధీ మాత్రం ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఇటు తమ్మినేని పై, అటు కూన రవిపై విమర్శనాస్త్రాలను సంధిస్తూ ప్రచారంలో ముందుకెళ్లారు. మామా అల్లుల్లు ఇద్దరు ఒకరిపై ఒకరు బయటికి విమర్శించుకుంటున్న లోపాయికారీగా ఇద్దరి మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని సువ్వారి గాంధీ విమర్శలు గుప్పించారు.కూన రవికుమార్‌కి ఆమదాలవలస టీడీపీలో ఎటువంటి వ్యతిరేకతా లేదు. కానీ స్పీకర్ తమ్మినేని సీతారాంపై ఆ పార్టీ రెబల్ పోటీకి దిగడం ఆయనకు తలనొప్పిగా మారిందంట. మరో వైపు ఆమదాలవలస నియోజకవర్గంలో తమ్మినేని సీతారాం పై అనేక ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణా లో తన తమ్మినేని సీతారాం కోట్లు రూపాయలు వెనకేసుకున్నారనే ఆరోపణలు కూడా తమ్మినేని కి ఈ సారి ఎన్నికల్లో ఇబ్బందిపెట్టే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తుంది. ఒవైపు ఆమదాలవలస రోడ్ పూర్తి కాకపోవడం.. అందులో కూడా తమ్మినేని కి అవినీతి ఆరోపణలు.. అదే రోడ్ పై పదుల సంఖ్యలో మరణాలు.. ఈ సారి ఎన్నికల్లో తమ్మినేనికి నెగిటివ్‌గా మారాయని సొంత పార్టీ వాళ్లే చర్చించుకుతున్నారు.ఆ లెక్కలు ఎలా ఉన్నా సువ్వారి గాంధీ ఆమదాలవలసలో వైసీపీని బానే దెబ్బతీసారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సుమారు గా 6 నుంచి 8 వేల వరకు వైసీపీ ఓట్లు చీల్చారన్న అంచనాలు పోలింగ్ తర్వాత వినిపిస్తున్నాయి. మరోవైపు కూటమి తరపున పోటీ చేసిన కూన

# ఘనంగా సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం....



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 30 కార్మిక వర్గానికి అండ సిఐటియు జెండా అని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,పట్టణ,మండల అధ్యక్షులు నక్కిశ్రీకాంత్,పి.రామాంజనేయులు అన్నారు.సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కొండపేటలోని మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం దగ్గర మండల అధ్యక్షులుపి.రామాంజనేయులు జెండా ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ 1970 వ సంవత్సరంలో కలకత్తా నగరంలో పతాకఆవిష్కరణతో సిఐటియు ఆవిర్భవించింది అన్నారు.ఆనాటి నుండి ఈనాటి వరకు వర్గ రాజకీయ సిద్ధాంతాన్ని కాపాడుకోవడం కోసం,దేశంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రపంచీకరణ,ప్రైవేటీకరణ,సరళీకరణ విధానాలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేయడంలో అగ్ర భాగాన నిలిచింది అన్నారు.కార్మిక రాజ్య స్థాపన కోసం,కార్మిక హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్నది సిఐటియు మాత్రమేనని వారు అన్నారు.కార్మిక సమస్యల పరిష్కారం కోసం అనేక బలమైన సమ్మెలను నిర్వహించడంలో వివిధ కార్మిక సంఘాలను ఐక్యం చేయడంలో సిఐటియు కీలక పాత్ర పోషిస్తున్నదని వారన్నారు. బ్రిటిష్ కాలం నుండి కార్మికులు పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం కాల రాశి కేవలం యజమానుల ప్రయోజనాల కోసం కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చే విధానాలతో తెస్తున్న నాలుగు లేబర్ కోడ్ లపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నది సిఐటియు అన్నారు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని,ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని,నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వ శాఖల్లో ఉన్న కాళీ పోస్టులను భర్తీ చేయాలని అయితే ప్రభుత్వ విధానాలు మాత్రం పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసే విధంగా ఉన్నాయని కార్మికుల జీవితాలను నాశనం చేయాలని చూస్తే సహించేది లేదని సిఐటియుగా ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తూనే ఉంటామని రాబోవు కాలంలో కూడా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించబోయే కార్మిక,ఉద్యోగ,రైతాంగ,ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులంతా ఐకమత్యంతో సిఐటియు జెండా చేత పట్టి ఉద్యమాలను మరింత విదృతం చేయాలని సిఐటియు లక్ష్యం ప్రతి కార్మికుడికి కూడు, గూడు,గుడ్డ,విద్య,వైద్యం అన్నీ సమపాళ్లలో అందాలని అది నెరవేరాలంటే కార్మిక రాజ్య స్థాపనతోనే సాధ్యమని కావున కార్మిక రాజ్య స్థాపనే ధ్యేయంగా కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు బి.నాగన్న, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్న రహిమాన్, లారీ,ఆటో,మున్సిపల్ వర్కర్స్ తదితర యూనియన్ల నాయకులు శీను,రాము, జనార్ధన్,తిరుపాలు కుళ్లాయప్ప,ఆవులయ్య, మహేష్,వన్నూరు,రంగడు,సూరన్న,నాగేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానవ సేవే మాధవ సేవ...



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 30 మానవ సేవే మాధవ సేవ అంటూ సమాజ హితం కోరుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్ఫూర్తి సేవా సమితి సేవలు అభినందనీయమని, అందులో సేవ చేస్తున్న సభ్యులు నేటితరం యువతకు స్ఫూర్తి దాయకమని డోన్ డీ.యస్.పి శ్రీనివాస రెడ్డి అన్నారు. డోన్ మండలం ఆవులదొడ్డి గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనివాసులు అనే వృద్ధుడికి నా అనేవారు ఎవరు లేక కొంతకాలంగా డోన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద యాచించుకుంటూ ఆహారం నిద్ర లేక నడవలేని స్థితిలో ఒంటిపై మల మూత్రాలతో దుర్భర స్థితిలో ఉండగా స్ఫూర్తి సభ్యులు అతడికి సపర్యలు చేసి అతడి సంరక్షణ నిమిత్తం కడప జిల్లా యర్రగుంట్ల నందు గల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో చేర్పించి, ఆశ్రమానికి కొంత ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా డోన్ డీ.యస్.పి స్ఫూర్తి సభ్యులను మెచ్చుకొని అభినందించారు. వృద్ధుడిని ఆశ్రమంలో చేర్చేందుకు అవసరమైన ఆర్థిక సాయన్ని డోన్ టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్, ఆవులదొడ్డి సర్పంచ్ ఉల్చాల మద్దయ్య లు స్ఫూర్తి టీమ్ కి అందించి వారి సేవా గుణాన్ని చాటుకున్నారు. వృద్ధుడి గురించి తెలిపిన వెంటనే ఆశ్రమంలో చోటు కల్పించిన శేషమ్మ ఆశ్రమ నిర్వహకుడు నాగేంద్ర కు స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు స్ఫూర్తి మధు, సభ్యులు చంద్ర, అంజి యాదవ్, నారాయణ స్వామి, మెహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతి పట్ల సంతాపం తెలిపిన గౌతమ్ రెడ్డి..



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 30 ప్యాపిలి మండలం, మెట్టుపల్లె గ్రామంలో రామాంజనేయులు మృతి చెందడంతో యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి వారి భౌతిక కాయాన్నికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.వారికుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా మాజీ ఎంపిపి ఆర్.ఈ.రాఘవేంద్ర, ప్యాపిలి మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి మెట్టుపల్లె సుదర్శన్ నివాళులు అర్పించారు.

## దత్తాత్రేయ స్వామినీ దర్శించుకున్న... కోట్ల



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-మే 30 డోన్ పట్టణం సమీపంలో ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి వారి ఆలయమును సందర్శించిన కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి నాగేశ్వర యాదవ్ శ్రీనివాసులు యాదవ్ శశి రెడ్డి వెంకటసుబ్బయ్య వలసల రామకృష్ణ భాస్కర నాయుడు సీమ సుధాకర్ రెడ్డి మహారాజ బ్రహ్మంగారు గోసానిపల్లె శ్రీరాములు సీమ సుబ్బారెడ్డి తాడూరు రమణయ్య తదితరులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదము తీసుకున్నారు

# నకిలీ విత్తనాల అరికట్టాలి

**సహకార బ్యాంకుల ద్వారా రైతులకు పంట రుణాలు ఇవ్వాలి**
**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 30- నంద్యాల పట్టణం సాయిబాబా నగర్ లో సిపిఐ కార్యాలయంలో గురువారం రైతు సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశమునకు అధ్యక్షులుగా రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు పిక్కలి వెంకటేశ్వర్లు. అధ్యక్షత వహించారు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతున్న తరుణంలో అన్ని మండల కేంద్రాలలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు సరిపడా విత్తనాలు వేరుశనగ మిరప పత్తి వరి విత్తనాలు అందుబాటులో ఉండేటట్టుగా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు . రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలని అదేవిధంగా ఖరీఫ్ సీజను కొందరు దళారులు నకిలీ విత్తనాలు విక్రయించడం జరుగుతుందన్నారు. తక్షణమే వ్యవసాయ అధికారులు అప్రమత్తం మై రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయించిన యెడల వారి మీద క్రిమినల్ చర్యలు తీసుకొని చట్టబద్ధంగా శిక్షించాలని తెలిపారు. వారి లైసెన్సులు రద్దు చేయాలి సీడ్స్. ఫర్టిలైజర్ షాపులను అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరారు. సహకార బ్యాంకుల ద్వారా రైతులకు అందించవలసిన పంట రుణాలను వెంటనే అందించి విత్తనాలు- ఎరువులకు సరిపడా పంట రుణాలను అందించి ఆదుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ లో ఎక్కడైనా నకిలీ సీడ్స్ నకిలీ మందులు మరుగు మందులు ఉన్నయెడల ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో ధర్నా హాలు నిర్వహించి అధికారుల వైఫల్యాలను ఎండగట్టుతూ. రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ బి రామకృష్ణ రేవనూరు రాజ్ కుమార్ ఏసన్న ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

# కరోణాలో కార్డు దారులకు నగదు పంచిన జాబితా ఇవ్వండి

**మునిసిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి**



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 30- కరోనా కాలంలో ప్రతి రేషన్ కార్డు దారునికి ప్రభుత్వం వెయ్యి రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని ఉద్దేశంతో సచివాలయ వార్డు వెల్ఫేర్ సెక్రెటరీల ద్వారా పంపిణీ చేయించారు. ఎంత మంది కి పంపిణీ చేశారనే జాబితాను మున్సిపల్ కార్యాలయం లో అందజేయాలని వార్డు వెల్ఫేర్ సెక్రెటరీలకు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఆదేశించారు . గురువారం మున్సిపల్ కార్యాలయం లో విలేకరులతో కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ 2020 సంవత్సరం కరోనా సమయంలో ప్రతి రేషన్ కార్డు దారునికి ప్రభుత్వం ఆర్థిక సహాయం కింద వెయ్యి రూపాయలు నగదు పంపిణీ చేయాలని సచివాలయ వార్డు వెల్ఫేర్ సెక్రెటరీల కు అదేశాల జారీ చేశారన్నారు . ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నంద్యాల పురపాలక సంఘము పరిధిలోని 43 వార్డుల యందు 2020 మార్చి, ఏప్రిల్ నెలలో పెన్షన్స్ వార్డు వెల్ఫేర్ సెక్రెటరీలు/వార్డు వాలంటీర్లు పంపిణీచేశారు.ఎన్నిపెన్షన్స్ పం చారు మరియు ఎన్ని రేషన్ కార్డు దారులకు ఎంత అమౌంట్ పంపిణీ చేశారనే లిస్టు రాష్ట్ర కార్యద ర్శి కి పంపాలని కమిషనర్ తెలి పారు . కొన్ని వార్డుల యందు రైస్ కార్డులు పంపిణీ చేయుటకు అమౌంట్ తక్కువ కావడంతో ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్డీఎ నంద్యాలవారి ఆదేశము లమేరకు మార్చి, ఏప్రిల్ నెల పెన్షన్లు అమౌంట్లో నుండి కొంత మొత్తాన్ని వాడుకున్నారని తెలిపారు , కావున నంద్యాల పురపాలక సంఘము పరిధిలోని 43 వార్డుల యందు 2020 మార్చి, ఏప్రిల్ నెలకు సంబందించిన పెన్షన్, రైస్ కార్డు లబ్దిదారుల జాబితాను వార్డుల వారిగాఇవ్వలసినదిగా సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీలకు తెలిపారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## శ్రీ మహానందీశ్వర హుండీ 65 రోజులకు 66,46,755



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 30- శ్రీ మహానందీశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఆలయ కార్య నిర్వహణ అధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి గారి పర్యవేక్షణలో ప్రారంభమైన హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మరియు బాలాజీ సేవా ట్రస్ట్ మరియు తిరుమల బాలాజీ సేవాసమితి సేవా సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు. గురువారం దేవస్థాన అభిషేక మండపం యందు నిర్వహించిన ఉభయ అలయముల హుండీ లెక్కింపు ద్వారా భక్తులు 65 రోజులకు సమర్పించిన కానుకల ఆలయాల ద్వారా 6546755 /-రూ. అన్న ప్రసాదం 94915/- రూ. గోవు సంరక్షణ 35644/- రూ.మొత్తం 66,46,755 /- రూ వచ్చినట్టు ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖా తరుపున వెలుగోడు గ్రూప్ దేవాలయము ల ఈఓ. వి జనార్దన్ ,దేవస్థాన ఎఈవోలు వై మధు,ఓ వెంకటేశ్వరుడు , టెంపుల్ ఇన్స్పెక్టర్లు. రాజు , శశిధర్ రెడ్డి. ఆలయ అర్చకులు, సిబ్బంది, ఏజెన్సీ వర్కర్స్, పలు నుండి విచ్చేసిన భ్రమరాంబిక సేవా సమితి సేవకులు, కృష్ణ దత్త సాయి సేవా సమితి సేవకులు. తదితరులు పాల్గొన్నారు

## కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి :ఆర్వో.టి. రాహుల్ కుమార్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 30- కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నంద్యాల అర్వో టి. రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం నాడు ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఉదయం అర్జీయం కాలేజ్లో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. నంద్యాల నియోజవర్గం 14 టేబుల్స్ 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశామని తెలిపారు , స్ట్రాంగ్ రూమ్ ల వద్ద కట్టుదిట్టమైన భద్రతకు బలగాలను మొహరిస్తున్నట్లు పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పని చేస్తున్నాయన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా లెక్కింపును చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190